సాక్షి తిరుపతి

బుధవారం ¦ 18 ¦ జనవరి ¦ 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,550
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,230

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,300
రిటైల్ వెండి గ్రాము	రూ.73.30



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	17
చిత్తూరు	31	16
తిరుమల	27	13
గూడూరు	31	19
నగరి	32	18



పకడ్బందీగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్

గూడూరు: జిల్లాలో ఈనెల 22న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పోలీసు, రీజనల్ కో–ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

న్యూస్‌రీల్

గణతంత్ర ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమీక్ష సమావేశానికి నగర కమిషనర్ అనుపమ అంజలి, డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో రిపబ్లిక్ వేడుకలు కూడా నిర్వహించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షలో తుడా సెక్రటరీ లక్ష్మి, ఏఓ జయరాములు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, సివిల్ సప్లైస్ జిల్లా అధికారి ఎస్‌ఎం ప్రసాద్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లపై నేడు కౌన్సిల్ సమావేశం

తిరుపతి తుడా: నగరంలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అనుమతులు, నిధుల మంజూరే ఏకైక అజెండాగా బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. నగర మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన జరిగే ఈ కౌన్సిల్‌కి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరుకానున్నారు. తిరుపతి నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నగర విస్తరణ, నగరంపై ఒత్తిడి తగ్గించడం, నగరానికి కనెక్టివిటీ పెంచడం, పట్టణ తూర్పువైపు ఉన్న సుమారు మూడు వేల ఎకరాలను అభివృద్ధి చేయడంపై సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.

నేడు ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్



డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సీనియర్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఈనెల 18 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనియర్ ఎస్‌జీటీలను స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌గా అవసరమున్న పాఠశాలల్లో నియమిస్తామన్నారు. అర్హులైన ఎస్‌జీటీల జాబితాలను డీవైఈఓ, ఎంఈఓల మెయిల్‌కు పంపినట్లు తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న ఎస్‌జీటీలు సర్వీస్ రిజిస్టర్లతో బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు డీఈవో కార్యాలయానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎవరికీ ఎటువంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 66 మండలాల ఎంఈవోలు జాబితాలోని టీచర్లను కౌన్సెలింగ్ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని డీఈవో ఆదేశించారు.

గ్రూప్–1 మెయిన్స్‌కు ఎంపిక



భాగ్యలక్ష్మి

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర పరిశోధన విద్యార్థి జి.భాగ్యలక్ష్మి టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్–1 సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణురాలై మెయిన్ పరీక్షకు ఎంపికయ్యారు. ఈమె వివాహం చేసుకున్న తర్వాత డిగ్రీ, పీజీ పూర్తిచేశారు. వీరి కుమార్తె డాక్టర్ కోర్సులో చేరగా, కుమారుడు ఇంజినీరింగ్ చదివారు. ఇదిలావుండగా టీఎస్‌పీఎస్‌సీ పరీక్షలో ఎంపికైన భాగ్యలక్ష్మి మహాత్మాజ్యోతీరావు పూలే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆమె 2022 నుంచి శ్రీపద్మావతి మహిళావర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. 2022 అక్టోబర్ 16న జరిగిన టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్–1లో మెయిన్ పరీక్షకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమెను మహిళా వర్సిటీ పీహెచ్‌డీ గైడ్ డాక్టర్ పీ.మాధవి, డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పీ.నీరజ, డాక్టర్ ఎం.పద్మావతి అభినందించారు.

విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై మాక్ డ్రిల్

తిరుపతి రూరల్: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19 నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) వర్చువల్ పద్ధతిలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ మూడు విద్యుత్తు పంపిణీ సంస్థలకు సంబంధించిన అధికారులు విశాఖపట్నం నుంచి పాల్గొననున్నారు. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో మంగళవారం నమూనా ప్రజాభిప్రాయ సేకరణ (మాక్ డ్రిల్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా https://ncubestreamings.com/apercpublichearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

స్మార్ట్.. వాటర్!

దశాబ్దాలుగా ఎదురవుతున్న మురుగునీటి సమస్యకు శాశ్వతంగా చెక్‌పెట్టేలా.. కలుషితం నుంచి భూగర్భ జలాలను కాపాడేలా.. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆవిష్కరించేలా.. ప్రాణవాయువును మరింత పెంచేలా.. నగర ప్రజలు, భక్తులకు స్వచ్ఛ వాయువులు అందించేలా.. కార్పొరేషన్ అధికారులు, పాలకులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే దేశంలోనే అతిపెద్ద మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. స్మార్ట్ సిటీలో భాగంగా రెండు నెలల్లోనే ప్రాజెక్టును పూర్తిచేసి ప్రశంసలు అందుకుంటున్నారు.

- తిరుపతిలో అత్యాధునిక మురుగునీటి శుద్ధి కేంద్రం
- రూ.14.95కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణం
- దేశంలోని అతిపెద్ద సీవేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
- రోజుకు యాభైలక్షల లీటర్లు శుద్ధి చేసేలా రూపకల్పన
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే, మేయర్



కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ వద్ద కొత్త టెక్నాలజీతో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రం



వ్యర్థాలను వేరు చేసే యంత్రం



శుద్ధి చేసిన నీరు సాగర్‌లోకి పంపింగ్

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరంలో స్వచ్ఛ భారత్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను సంబంధిత అధికారులు, పాలకులు వంద శాతం అమలు చేస్తున్నారు. అభివృద్ధి ఫలాలతో పాటు నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, ఆధునిక సౌకర్యాలు కల్పించడం, కాలుష్య రహిత నగర స్థాపనకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతిలో వెలువడే వ్యర్థపు నీటిని శుద్ధిచేసే భారీ ప్రాజెక్టును స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చారు. కరకంబాడి రోడ్డు, వినాయక సాగర్ వద్ద ఏర్పాటైన ఈ ప్రాజెక్టును బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి లాంఛనంగా ప్రారంభించనున్నారు.


మనమే నం.1

నగరం నుంచి వెలువడే మురుగునీటిలో రోజుకు యాభై లక్షల లీటర్లను శుద్ధి చేసే విధంగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఇందుకోసం 50 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు భారీ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. ఈ తరహా కేంద్రాలు ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేవని అధికారులు చెబుతున్నారు. కేవలం 20 లక్షల సామర్థ్యంతో ఏర్పాటైన ట్యాంకులు మాత్రమే ఉన్నాయని పేర్కొంటున్నారు. హైదరాబాద్, పూనె, గుజరాత్, ఇండోర్ వంటి నగరాల్లో మాత్రమే సీవేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నట్టు తెలిపారు.

బయోకెమికల్ ఆక్సిడేషన్ పద్ధతిలో..



ట్రీట్‌మెంట్ ఆఫ్ నేచర్, బై నేచర్, నేచురల్లీ పద్ధతిలో మురుగు నీటిని శుద్ధి చేసే ప్రక్రియనే బయోకెమికల్ ఆక్సిడేషన్ అంటారు. ఎలాంటి కెమికల్స్‌ను కలపకుండా ప్రకృతి సిద్ధంగానే వందశాతం మురుగు నీటిని శుద్ధి చేయడం దీనిప్రత్యేకత. భారీ ట్యాంకులో సైజుల వారీ రాళ్లతో నింపి.. పైభాగంలో ఎలిఫాంట్ ఇయర్ ప్లాంట్, అంబ్రిల్లా పాల్మ్, ఇండియన్ షాట్ వంటి మొక్కలను పెంచుతారు. ఈ మొక్కలు కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకొని వేర్లద్వారా ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. కింది భాగంలో ఉండే బ్యాక్టీరియా ఈ ఆక్సిజన్ తీసుకుంటూ జీవిస్తాయి. ఈ క్రమంలో మురుగునీటిలోని వ్యర్థాలను ఈ బ్యాక్టీరియాలు శుద్ధిచేస్తాయి. నేచురల్ పద్ధతిలో శుద్ధిచేసే విధానంతో 70 శాతం ఫిల్టర్ అవుతుంది. ఆ తరువాత ప్రెజర్‌శాండ్, ఆక్సివేటెడ్ కార్బన్ ఫిల్టర్ల ద్వారా వందశాతం మురుగునీటిని శుద్ధి చేస్తారు. ఆపై క్లోరినేషన్ ట్యాంకులో క్లోరిన్‌ను కలిపి వినాయక సాగర్‌లోకి విడుదల చేస్తారు.



సంకల్పించి.. సంపూర్ణంగా పూర్తిచేసి



ఆక్సిజన్ కోసం ఏర్పాటైన గార్డెన్

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మురుగు నీటి శుద్ధి కేంద్రం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్ల వ్యవధిలోనే ప్రాజెక్టును యుద్ధప్రతిపాదికన పూర్తిచేశారు. ఈ ప్రాజెక్టు కోసం స్మార్ట్‌సిటీ నిధు రూ.14.95 కోట్ల ఖర్చుచేశారు. కరకంబాడి రోడ్డు, వినాయకసాగర్ పడమటివైపున సుమారు ఎకరా స్థలంలో ప్రాజెక్టును నిర్మించారు.

వ్యర్థాలు తొలగించి.. ఎరువుగా మార్చి



వ్యర్థాల తొలగింపు ఇలా..

నేషనల్ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు నిల్వ ఉన్న నీటిలోకి డ్రైనేజీ నీరు వదలరాదు. ఈ నిబంధనల మేరకు ప్రాజెక్టును పూర్తిచేశారు. ఇకపై వినాయక సాగర్‌లోకి శుద్ధిచేసిన నీటినే వదలనున్నారు. నగరంలోని మురుగునీరు వినాయక సాగర్ సమీపంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరేలా ప్రక్రియ చేపట్టారు. ఈ వ్యర్థపు నీటిని ప్లాంట్‌లోకి చేరేలోపే రెండు చోట్ల యంత్రాల ద్వారా ప్లాస్టిక్, ఉడ్, బాటిళ్లు వంటివి తొలగిస్తారు. ఆ తరువాత సెడిమెంటేషన్ ప్లాంట్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడ ఓవర్ ఫ్లో, అండర్‌ఫ్లో విధానంతో మరొక సారి మురుగునీటిలోని వ్యర్థాలను తొలగిస్తారు. అలా తొలగించిన వ్యర్థాలను ఎరువుగా మారుస్తారు. తర్వాత మురుగునీటిని మరో ట్యాంకులోకి పంపించి శుద్ధి చేస్తారు.

సమాచారం

- తిరుపతి నగరంలో ఒక రోజుకు వెలువడే మురుగునీరు : 33 ఎమ్మెల్డీ
- ల్యాంకో ఫ్యాక్టరీకి సరఫరా చేస్తున్న శుద్ధిచేసిన నీరు : 4 ఎమ్మెల్డీ
- లీటరుకు చెల్లిస్తున్న మొత్తం : రూ.8.4
- ఏడాదిలో కార్పొరేషన్‌కు వస్తున్న ఆదాయం : రూ.1.31 కోట్లు
- పరిసర ప్రాంత రైతులకు ఉచితంగా ఇస్తున్న మురుగునీరు : 29 ఎమ్మెల్డీ
- వినాయక సాగర్‌కు వస్తున్న మురుగు నీరు – 3 ఎమ్మెల్డీ
- సివేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ సామర్థ్యం – 5 ఎమ్మెల్డీ
- శుద్ధి చేసిన నీటిని వినాయక సాగర్‌కు వదలడం, మిగులు జలాలు దిగువ ప్రాంతాల్లోని రైతులకు ఉచితంగా సరఫరా చేయడం, పార్కులు, డివైడర్‌లోని మొక్కల పెంపకానికి ఉపయోగించడం, దిగువ ప్రాంతాల్లోని చెరువులకు వదలడం

కాలుష్య రహిత నగరమే లక్ష్యం



కాలుష్య రహిత నగరాన్ని ఆవిష్కరింపజేసి నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, ఆరోగ్యకరమైన పరిస్థితులు, స్వచ్ఛతలో జీవన విధానం సాగేలా పరిస్థితులు కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. ఇందులో భాగంగానే డ్రైనేజీ మురుగునీటి శుద్ధి ప్రాజెక్టును పూర్తిచేశాం. దాదాపు రూ.40కోట్ల వ్యయంతో నగరానికి తలమానికంగా వినాయక సాగర్‌ను అభివృద్ధి చేస్తున్నాం.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

వందశాతం శుద్ధి చేస్తాం



తిరుపతిలో నిర్మించిన సివేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ దేశంలోనే అతిపెద్దది. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేశాం. బయోకెమికల్ ఆక్సిడేషన్ పద్ధతిలో మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తాం. ఇలా శుద్ధిచేసిన నీటిని సాగర్‌లోకి విడిచిపెట్టే ప్రక్రియ రూపొందించాం. దీంతో కొన్నేళ్లకు ఈ ప్రాంతం కాలుష్య రహితంగా ఆవిష్కృతమవుతుంది.

– అనుపమ అంజలి, ఎండీ, తిరుపతి స్మార్ట్‌సిటీ

వైభవంగా కొండచుట్టు మహోత్సవం



జనసంద్రం నడుమ కొండచుట్టు మహోత్సవానికి బయల్దేరిన మూలస్థాన ఎల్లమ్మ

- వేలాదిగా తరలివచ్చిన జనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

చంద్రగిరి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ దేవి కొండచుట్టు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను స్థానిక కోదండరామాలయానికి ఆలయ అధికారులు తీసుకువచ్చారు. అనంతరం ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ శ్రీనివాసులు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు.

వైభవంగా కొండ చుట్టు

శ్రీమూలస్థాన ఎల్లమ్మదేవి అమ్మవారి కొండచుట్టు మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ముందుగా అమ్మవారు ధర్మరాజుల ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలందుకున్నారు. అక్కడి నుంచి ద్రౌపది, ధర్మరాజుల సమేత భీమ, అర్జునులతో కొండ చుట్టుకు పయనమయ్యారు. మండలంలోని అగరాల గ్రామానికి రాత్రి 9గంటల సమయంలో అమ్మవారు తన అక్క అయిన ఆరిమేణి గంగమ్మ చెంత కొలువుదీరారు. అనంతరం పుట్టింటి సారెను స్వీకరించారు. అక్కడి నుంచి అమ్మవారు ఐతేపల్లి, పుల్లిత్తివారిపల్లి, నాగయ్యగారిపల్లి, రామిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా బుధవారం ఉదయం కొండచుట్టు మహోత్సవం ముగించుకుని తిరిగి చంద్రగిరికి చేరుకోనున్నారు. రాత్రంతా ఊరేగుతూ గ్రామాల్లోని ప్రజల చేత ప్రత్యేక పూజలందుకోనున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఈవో రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

ముక్కోటి దేవతలు ఒక్కటైన వేళ

నగరి పట్టణంలో కొండచుట్టు ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఏక కాలంలో సకల దేవతామూర్తులు ఒక్కచోటకు చేరడంతో చూసేందుకు కాంచిన కనులదే భాగ్యం అన్నట్లు భక్తులు దర్శించి తన్మయత్వం చెందారు. ఉదయం నుంచే మండపం వద్ద హడావుడి మొదలైంది. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కొండచుట్టు నిర్వహించడం ఆనవాయితీ. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా శ్రీకరకంఠేశ్వర స్వామికి అభిషేక పూజలు, అలంకరణలు చేసి మండపం వద్దకు వేంచేపు చేశారు. – నగరి



మండపం వద్ద కొలువుదీరిన దేవతలు

ఏటికి పండగొచ్చింది!

- అట్టహాసంగా సాగుతున్న ఏటిపండుగ సంబరాలు
- తండోపతండాలుగా తరలివస్తున్న ప్రజలు
- యువతను ఉర్రూతలూగిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నాయుడుపేట టౌన్: మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు, యువకుల కేరింతలు, కొత్తగా పెళ్లైన జంటలు, రకరకాల దుకాణాలు.. అబ్బో! స్వర్ణముఖి నదీతీరాన పండగ వాతావరణం నెలకొంది. ఏటి పండుగ సంబరాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు జనం పోటెత్తారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని మురిసిపోయారు. ఏర్పాటు చేసిన రంగుల రాట్నాల్లో చిన్నారులు తిరుగుతూ సందడి చేశారు. గాలిపటాలు ఎగురవేస్తూ.. కేరింతలు కొడుతూ ఆకట్టుకున్నారు. పెళ్లైన కొత్త జంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ కటకం దీపిక తదితరుల నేతృత్వంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కృష్ణయ్య, శ్రీకాంత్ తదితర పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

గల్లీబాయ్స్ సందడి

నిస్సీ ఈవెంట్స్‌కు చెందిన మేర్లపాక హరి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. అమూల్యా యాంకర్‌గా వ్యవహరించారు. బుల్లితెర నటులు గల్లీబాయ్స్ బృందం సద్దాం, రియాజ్, భాస్కర్ తదితరులు సందడి చేశారు. అలాగే ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు రాజు సినీ హీరోలు, విలన్‌లను అనుసరిస్తూ మాట్లాడిన తీరు సభికులను ఆనందంలో ముంచెత్తింది. నెల్లూరుకు చెందిన లిఖిత, పలువురు చిన్నారులు చేసిన భారత నాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సింగర్ శీను, సునీత పాటకచ్చేరి ఆనందడోలికల్లో ఓలలాడించింది. ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, జీ సిద్ధయ్య, చెవూరు చెంగయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దారా రవి తదితరులు పాల్గొన్నారు.



ఏటి పండుగకు పోటెత్తిన జనం



సందడి చేస్తున్న గల్లీబాయ్స్ సద్దాం, రియాజ్

క్లుప్తంగా

19, 20న డీఫార్మసీ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : డీ ఫార్మసీ కోర్సులో 2022–23లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 19, 20 తేదీల్లో కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18, 19వ తేదీల్లో 'ఏపీడీపీహెచ్ఏఆర్ఎం.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ర్యాంకు కార్డు, పది, ఇంటర్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు / 01–01–2019 తరువాత తీసుకున్న ఆదాయపు సర్టిఫికెట్, కుల సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒరిజినల్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని సూచించారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న వారు 19, 20, 21 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

అమ్మవారి సేవలో వంశీ పైడిపల్లి


ఆలయం వెలుపల దర్శకుడు వంశీ పైడిపల్లి

తిరుచానూరు: సినీ దర్శకుడు పైడిపల్లి వంశీ మంగళవారం శ్రీ పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈఓ లోకనాథం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

శ్రీకాళహస్తి: హత్యకేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో భార్య ఉమామహేశ్వరిని సోమవారం ఇంటి వద్ద కర్రతో కొట్టడంతో ఆమె మృతి చెందిన విషయం తెల్సిందే. అక్కడి నుంచి పరారైన భర్త చెంగయ్యను మంగళవారం రాత్రి 1వ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

రంకెలేస్తూ..
పరుగులు తీయిస్తూ..

జోరుగా ఎడ్ల పందేలు • బహుమతులు సొంతం చేసుకునేందుకు యువకుల పాట్లు

చంద్రగిరి: నడుముకు నల్లటి దారం చుట్టి, కాళ్లకు పట్టీలు కట్టి.. కొమ్ములకు పలకలు చుట్టి.. రంకెలేస్తూ.. పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. మండలంలోని దోర్నకంబాల, మండపంపల్లి, మల్లయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం ఎడ్ల పందేలను ఘనంగా నిర్వహించారు. పలకలు, బహుమతులు సొంతం చేసుకునేందుకు పలువురు పోటీ పడ్డారు.

పట్టుకుంటే రూ.లక్ష నజరానా

తన పశువులను పట్టుకున్న వారికి రూ.లక్ష నజరానా అందిస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మగుంట రవి ప్రకటించారు. దోర్నకంబాలలో ఆయన ఎమ్మెల్యే చెవిరెడ్డి చిత్రంతో కూడిన ఎద్దును బరిలోకి దింపారు. రూ.లక్ష అనగానే యువకులు ఎద్దును నిలువరించేందుకు యత్నించారు. అయితే ఎవరితరమూ కాకపోవడంతో వెనుదిరిగారు. అదే గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి శ్రీవేంటేశ్వరస్వామివారి వెండి చిత్రపటాన్ని ఎద్దుకు కట్టి జనంలోకి వదిలారు.


దోర్నకంబాలలో ఎడ్ల పందేలు


దూసుకెళ్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి చిత్రపటంతో కూడిన ఎద్దు


ఎద్దుకు కట్టిన పలకను సొంతం చేసుకునేందుకు పోటీ పడుతున్న యువకులు

ఈకేవైసీ త్వరగా పూర్తిచేయండి

తిరుపతి రూరల్ : ఈక్రాప్ బుకింగ్ పూర్తిచేసుకున్న రైతులకు సంబంధించి ఈకేవైసీని వందశాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆదేశించారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి, ముండ్లపూడిలో జరుగుతున్న ఈకేవైసీని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈక్రాప్ బుకింగ్ 99 శాతం పూర్తికావడం, ఈకేవైసీ కూడా 80శాతానికి పైగా ఇప్పటికే పూర్తి చేయడంపై మండల వ్యవసాయాధికారిని మమతను అభినందించారు. రైతులకు సంబంధించి బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా కూడా ఈకేవైసీని పూర్తి చేయవచ్చునని సూచించారు. రానున్న వారం రోజుల్లో వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏడీఏలు మనోహర్‌బాబు, ధనంజయులు, ఏవో మమత, సిబ్బంది పాల్గొన్నారు.


తనపల్లిలో ఈకేవైసీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

మిరపకు చీడపీడలు

తిరుపతి అర్బన్: జిల్లాలో మిరప పంటకు చీడపీడల సమస్య అధికమైంది. ప్రధానంగా తామర పురుగులతో పైముడత, నల్లి పురుగులతో కింద ముడత తెగుళ్లు, కాయతొలుచు పురుగుతో ఎండు తెగుళ్లు, కాయకుళ్లు తెగులు వ్యాప్తి చెంది పంట దెబ్బతింటోంది. దీంతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు.


తెగుళ్లు సోకిన మిరప పంట

చిన్న మందులు పిచికారీ చేస్తే చాలు



తిరుపతి జిల్లాలో ఈ సారి 2,400 ఎకరాల్లో మిరప పంట సాగుచేశారు. అక్కడక్కడా తెగుళ్ల సమస్య ఉంది. అయితే చిన్నచిన్న మందులు పిచికారీ చేస్తే సరిపోతుంది. ప్రధానంగా లీటర్ నీటికి 2 మి.లీ పిప్రోనిల్ లేదా 2 గ్రాముల పెగాసస్ లేదా 1.5 మి.లీ ఇంటర్ ప్రిడ్ లేదా 0.5 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ అనే పురుగు మందుల్లో ఏదో ఒకటి తీసుకోవాలి. ఆ ముందుల్లో ఒక మిల్లీగ్రాం అమిస్టార్ లేదా రెండు మిల్లీ గ్రాముల కవాచ్ పౌడర్‌ను కలిపి వారానికి ఒకటి, రెండుసార్లు పిచికారీ చేస్తే తెగుళ్లు ఉండవు.– ఎం.భాస్కరయ్య, వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం, ఏడీఏ

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

• సరదా కోసం వచ్చి ప్రమాదంలో దుర్మరణం


మృతి చెందన నిత్యశ్రీ

వరదయ్యపాళెం: పండుగ వేళ సరదా కోసం స్నేహితులతో కలసి ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రంకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం చెందిన ఘటన మండలంలోని వరదయ్యపాళెం అవంతి రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షణ్ముగం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై సిటీకి చెందిన కిషోర్ కుమార్తె నిత్యశ్రీ ఓ ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. సంక్రాంతి సెలవులు కావడంతో స్నేహితులతో సరదాగా గడపడానికి ద్విచక్ర వాహనంలో వరదయ్యపాళెం సమీపంలోని ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి మంగళవారం బయలుదేరారు. వరదయ్యపాళెం అవంతి రోడ్డు మార్గంలోని సంతోష్‌పురం సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను అధిగమించడానికి మోటారు బైకును వేగం తగ్గించేసరికి వెనుకనే వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న కిషోర్ వెనుక కూర్చొని ఉన్న నిత్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శ్రీసిటీలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర గాయాలైన నిత్యశ్రీ దుర్మరణం పాలైంది. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిత్యశ్రీ మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బియ్యం బొక్కేశాడు!

• తనిఖీల్లో బయటపడ్డ రేషన్ బియ్యం దోపిడీ
• పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు
• నాన్‌బెయిలబుల్ కేసుకు సిఫారసు


నిల్వ చేసిన బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాల్టీలోని పౌరసరఫరాల శాఖలో అవినీతి బాగోతం బట్టబయలైంది. బీఎంఆర్ నగర్‌లోని రేషన్ దుకాణ డీలర్ బియ్యం దోపిడీ తనిఖీల్లో బహిర్గతమైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ రాజేంద్ర కథనం.. గతంలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల నుంచి చెన్నై ప్రాంతాలకు అక్రమంగా తరలివెళ్లే రేషన్ బియ్యంపై పలుమార్లు సివిల్ సప్లైస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఐదు పర్యాయాలు బియ్యం పట్టుకున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని అప్పటి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ టీచర్స్ కాలనీలోని (8వ షాపు) డీలరు చౌకదుకాణంలో 31.725 టన్నులు నిల్వ ఉంచారు. ఆ సమయంలో రేషన్ షాపు వద్దే అధికారులు, స్థానికుల సమక్షంలో పంచనామా చేశారు. నిల్వ ఉంచిన బియ్యాన్ని రాత్రివేళల్లో అమ్మేశారంటూ డీలర్ లక్ష్మీనారాయణపై పలువురు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా ఈనెల 13న మండల తహసీల్దార్లతో కూడిన బృందం సదరు షాపులో తనిఖీలు చేసింది. ఈ తనిఖీల్లో 10 టన్నుల బియ్యం మాయమైనట్టు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా రెగ్యులర్‌గా అందించే బియ్యం, సరుకులకు సంబంధించిన రికార్డుల్లో కూడా 235 కేజీలు బియ్యం కాజేసినట్లు స్పష్టమైంది. రేషన్ షాపు డీలర్ లక్ష్మీనారాయణతో పాటు ఎండీయూ (డోర్‌డెలివరీ) ఆపరేటర్ జీ.హేమంత్ అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తహసీల్దార్ తెలిపారు. గతంలో కూడా రేషన్‌షాపు డీలర్ లక్ష్మీనారాయణ రెండు పర్యాయాలు అవినీతికి పాల్పడి పట్టుబడ్డారు. ఇటీవల గూడూరులోని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లోనూ 70 బస్తాల బియ్యం విక్రయించినట్లు 6ఏ కేసు నమోదైంది.

అందుకే ఫిర్యాదు చేశాం



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం వాస్తవం. మేము చేసిన తనిఖీల్లో పట్టుబడిన బియ్యంతో పాటు రెగ్యులర్‌గా వినియోగదారులకు పంపిణీ చేసే బియ్యం అమ్మేసినట్లు గుర్తించాం. నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేదిలేదు.
– ఎం.రాజేంద్ర, తహసీల్దార్, నాయుడుపేట

నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేస్తున్నాం



ప్రభుత్వ చౌకదుకాణంలో అధికారులకు పట్టుబడిన రేషన్ బియ్యంతో పాటు రెగ్యులర్‌గా వినియోగదారులకు అందించే రేషన్ బియ్యం దుర్వినియోగం అయినట్లు తహసీల్దార్ ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తున్నాం.
–ప్రభాకర్‌రావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, నాయుడుపేట

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



తిరుపతి క్రైమ్: తిరుపతి–రేణిగుంట మార్గం మధ్యలో కాటన్ మిల్ సమీపంలో రైలు కిందపడి మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. సుమారు 80 సంవత్సరాల గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని వివరాలు తెలియలేదు. దీనిపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిస్తే 9966182180 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి రూ.62,426 లబ్ధి


మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యంకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

• వైఎస్సార్ ఆసరా కింద రూ.23,926
• రైతు భరోసా కింద రూ.38,500
• పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు
• టీడీపీ నాయకుడి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించిన ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్: పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అందిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. నాయుడుపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడి కుటుంబానికి చేకూరిన లబ్ధి ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎమ్మెల్యే సంజీవయ్య మంగళవారం నాయుడుపేట పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారంపేటలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం ఇంటికి ఎమ్మెల్యే సంజీవయ్య వెళ్లారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిన బుక్‌లెట్‌ను అందజేశారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి వైఎస్సార్ ఆసరా కింద రూ.23,926లు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.38,500 మొత్తం రూ.62,426 లబ్ధి పొందినట్లు అందులో నమోదై ఉంది. ఎమ్మెల్యేతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, ఇతర నాయకులను సుబ్రహ్మణ్యం ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించారు. కుటుంబ సభ్యులను వారికి పరిచయం చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

భాకరాపేట ఘాట్‌లో బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

• అక్కడికక్కడే ఇద్దరు మృతి
• ఒకరి పరిస్థితి విషమం
• పండుగ చేసుకుని తిరిగి వస్తూ ప్రమాదం
• నూతనకాల్వలో విషాదం


ప్రమాదంలో పడి ఉన్న మృతదేహాలు

భాకరాపేట: మృత్యువు దూసుకొచ్చింది. ఇద్దరి యువకులను పొట్టనపెట్టుకుంది. ఒకరిని ఆస్పత్రి పాలు చేసింది. వారినే నమ్ముకున్న కుటుంబీకులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. మంగళవారం మధ్యాహ్నం తిరుపతి–పీలేరు జాతీయ రహదారి, భాకరాపేట ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ కథనం.. భాకరాపేట ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చిత్తూరు జిల్లా, రొంపిచెర్ల మండలం, రావెలవారిపల్లెకు చెందిన మురళి కుమారుడు సాయికృష్ణ (22), అతని స్నేహితుడు, తిరుపతికి చెందిన హేమంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

ఇద్దరూ మంచి స్నేహితులు

సాయికృష్ణ, హేమంత్ మంచి స్నేహితులు. ఇద్దరూ తిరుపతిలో ఐటీఐ చేస్తూ.. ఖాళీ సమయంలో పార్ట్ టైమ్‌గా నీటి శుద్ధి కేంద్రంలో పనిచేస్తున్నారు. అన్నమయ్య జిల్లా, కేవీపల్లె మండలం, నూతనకాల్వలోని సాయికృష్ణ అమ్మమ్మ ఇంటికి సంక్రాంతి పండగకని వెళ్లారు. సోమవారం బంధువులతో కలిసి పండగ చేసుకున్నారు. మంగళవారం ఉదయం తిరుపతికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు.

స్వామి మొక్కు తీర్చుకోవాలని..

సాయికృష్ణ మేనమామ కొడుకు శివ(24) హైదారాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు వచ్చిన శివ తమతోపాటు తిరుపతికి వచ్చి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని అటు నుంచే హైదారాబాద్‌కు వెళతాడని చెప్పడంతో ముగ్గురూ కలిసి ద్విచక్రవాహనంలో తిరుపతికి బయలుదేరారు. భాకరాపేట ఘాట్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సాయికృష్ణ, హేమంత్ అక్కడికక్కడే మృతిచెందారు. బస్సు చక్రాలు వారి తలలపై వెళ్లడంతో పరిసరాలు రక్తసిక్తమయ్యాయి. వెనుక కూర్చుని ఉన్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. బంధువుల ఆర్తనాదాలతో భాకరాపేట పోలీస్‌స్టేషన్ దద్దరిల్లింది. కేసు దర్యాప్తులో ఉంది.

తలకోనలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

ప్రముఖ పర్యాటక కేంద్రం, ప్రకృతి సోయగాలకు నిలయం, సకల జీవరాసులకు ఆలవాలమైన తలకోనకు ప్లాస్టిక్ మహమ్మారి సవాల్ విసురుతోంది. నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికారులు చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో తలకోన మొత్తం ప్లాస్టిక్ మయమైంది. అడిగేవారు లేకపోవడంతో పర్యాటకులు విచ్చలవిడిగా వినియోగించడం రివాజుగా మారుతోంది.

- ఎర్రావారిపాళెం

మృత్యువాత పడుతున్న మూగజీవులు

తలకోన పరిసరప్రాంతాల్లో ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, కవర్లు, బాటిళ్లు, సిల్వర్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. పార్సిల్ కవర్లు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. వీటికి చుట్టిన దారాలు కాళ్లకు తగులుకుని పక్షులు ఎగరలేక మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. మద్యం బాటిళ్లను సైతం బండలు, చెట్లు, రోడ్లపై పగలగొట్టడంతో పర్యాటకులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాల్సి ఉంది.




తలకోన పరిసర ప్రాంతాల్లో నిండిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు